సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 3 । జూలై । 2024



సౌమ్యనాథ ఆలయం.. శిల్పకళా నిలయం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం ఎంతో ప్రాశస్త్యం పొందింది. -8లో



విద్యార్థుల అస్వస్థతపై కలెక్టర్ సీరియస్

ఖాజీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.390	రూ.480
రెండోరకం	రూ.300	రూ.380



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1403 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	360	480
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 221.160 కిలోలు

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ఉపకరణాల మంజూరుకు నేడు పరీక్ష

రాజంపేట టౌన్: స్థానిక మన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి దివ్యాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాల మంజూరు కోసం నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమ్మిళిత విద్య జిల్లా కో – ఆర్డినేటర్ జనార్దన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 18 సంవత్సరాలలోపు దివ్యాంగులకు ఈ పరీక్షలను జరుపుతున్నట్లు చెప్పారు. అర్హులైన వారికి వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్, వీల్‌చైర్, రోలెటర్స్, సంక కర్రలు, సీపీచైర్ వంటి వాటిని ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. నిర్ధారణ పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగ పిల్లలకు సంబంధించి రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను తల్లిదండ్రులు తమ వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9985549549 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలతో అస్లామ్

రాజంపేట టౌన్: బెంగుళూరులో గత నెల 29వ తేదీ జరిగిన జాతీయస్థాయి ఐసీఎన్ ఇండియా న్యాచురల్ బాడీబిల్డింగ్ షో పోటీల్లో రాజంపేట పట్టణం ఉస్మానగర్‌కు చెందిన షేక్ అస్లామ్ ప్రతిభ కనబరిచి బంగారు పతకం గెలుచుకున్నారు. ఈవిషయాన్ని ఆయన మంగళవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఆస్ట్రేలియాకు సంబంధించిన ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన వందమంది పైగా క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీపడ్డారన్నారు. తాను క్లాసిగ్ విభాగంలో బంగారుపతకం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మెన్‌ఫిజిక్ విభాగంలో బ్రాంజ్‌మెడల్‌ను, ఫిట్‌నెస్ విభాగంలో సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నట్లు చెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థిని. చిత్రంలో డీఎంహెచ్ఓ కొండయ్య తదితరులు

పుల్లంపేట: పుల్లంపేట మండలం, అనంతసముద్రం ప్రాథమిక పాఠశాలను అన్నమయ్య జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయం అంగన్ వాడీ సెంటర్‌లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్బరస్ టాబ్లెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సానేశేఖర్, మనోజ్ చంద్ర, సీహెచ్ఓ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బెటాలియన్‌కు మంగళం!

కడప నగరంలోని 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌ను తిరుపతికి తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఇప్పటికే పీఐ స్టాఫ్, పరిపాలన సిబ్బందిని తిరుపతి గ్రూప్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో పాటు ఈ ఏడాది నిర్వహించిన ఎన్‌సీసీ పరీక్షా ఫలితాలను సైతం పెండింగ్‌లో ఉంచడంతో పాటు 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియను నిలిపివేయాలంటూ తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఎన్‌సీసీ యూనిట్స్ ఉన్న విద్యాసంస్థలతో పాటు విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

- ఎన్‌సీసీ బెటాలియన్‌లో అక్రమాలపై విచారణ
- అధికారులు, సిబ్బంది పాత్రపై ఫిర్యాదులు
- తిరుపతి గ్రూప్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- పీఐ స్టాఫ్, పరిపాలన సిబ్బంది తరలింపు
- విడుదల కాని ఎన్‌సీసీ ఫలితాలు
- ఎన్‌సీసీ ప్రవేశాలు తాత్కాలికంగా నిలుపుదల



30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కార్యాలయం

వైవీయూ: జిల్లాలో 1979లో 30 ఆంధ్రా బెటాలియన్ పేరుతో ఎన్‌సీసీ (నేషనల్ కేడెట్ కార్ప్) బెటాలియన్ ఏర్పాటైంది. అనంతరం 2004 ప్రాంతంలో కడప నగరం తెలుగుగంగకాలనీలో దాదాపు 4 ఎకరాల సువిశాల ప్రాంతంలో ఎన్‌సీసీ నగర్ పేరుతో 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ ఏర్పాటైంది. అప్పటి నుంచి వేలాది సంఖ్యలో ఎన్‌సీసీ కేడెట్స్ శిక్షణ పొందుతూ వస్తున్నారు. పదుల సంఖ్యలో కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపులు (సీఏటీసీ), నేషనల్ క్యాంపులు నిర్వహించారు. ఫైరింగ్ రేంజ్, డ్రిల్ మైదానం, టీఎస్‌సీ క్యాంపుకు అవసరమైన ఆప్టికల్స్‌ను ఏర్పాటు చేశారు. రూ. 50 లక్షలతో డ్రిల్ స్క్వేర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పలు సీఏటీసీ క్యాంపులు, రిపబ్లిక్ డే పెరేడ్ (ఆర్‌డీ) సెలక్షన్ క్యాంపులు, తల్‌సైనిక్ సెలక్షన్ క్యాంపులు, ట్రెక్కింగ్ క్యాంపులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇటీవల కాలంలో వచ్చిన ఆర్మీ అధికారులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో బెటాలియన్‌పై అంతర్గత విచారణ నిర్వహించిన ఉన్నతాధికారులు గతంలో ఒక కల్నల్‌ను సైతం బదిలీ చేసి తదుపరి స్థానంలో ఉన్న పరిపాలనాధికారికి బాధ్యతలు అప్పజెప్పారు.



ఎన్‌సీసీలో ప్రవేశాలు, క్యాంపులు నిలుపుదల

విద్యాసంవత్సరం ప్రారంభంలో ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించి ప్రవేశాలు కల్పించడం ఆనవాయితీ. అయితే 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి జూనియర్ డివిజన్ బాలబాలికలు, సీనియర్ డివిజన్ బాలబాలికలకు సంబంధించిన ప్రవేశాల ప్రక్రియను నిలిపివేయాలంటూ తిరుపతి గ్రూప్ కమాండర్ నుంచి కడప 30 ఆంధ్రా బెటాలియన్‌కు జూన్ 24 ఉత్తర్వులు వచ్చాయి. అదే విధంగా 30 ఆంధ్రా బెటాలియన్‌కు కేటాయించిన క్యాంపుల ఖాళీలను సైతం వేరే బెటాలియన్‌లకు కేటాయిస్తూ జూన్25న ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ పూర్తయి, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు క్యాంపులను నిలిపివేశారు. దీంతో పాటు కడప 30 ఆంధ్రా బెటాలియన్‌లో పనిచేస్తున్న పీఐ (పర్మినెంట్ ఇన్‌స్ట్రక్టర్స్) స్టాఫ్, సివిల్ స్టాఫ్‌ను తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్‌కు పంపుతూ జూలై 1న ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదే విధంగా తిరుపతి గ్రూప్‌లో కడప బెటాలియన్ కార్యాలయం ఏర్పాటుకు తగిన స్థలం, కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎన్‌సీసీ ఏపీ/తెలంగాణ డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో కడపలో పనిచేస్తున్న సిబ్బంది బెటాలియన్‌ను ఖాళీ చేసి తిరుపతి గ్రూప్‌కు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో కడప 30 ఆంధ్రా బెటాలియన్ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఏదైనా సమస్య వస్తే సమస్యను పరిష్కరించాలి కానీ కొత్త సమస్యను సృష్టించకూడదంటూ పలువురు ఎన్‌సీసీ అధికారులు పేర్కొంటున్నారు. అన్ని విధాలుగా వసతి కలిగి ఉండటంతో పాటు, భౌగోళికంగా కడప రాయలసీమ జిల్లాలు అన్నింటికీ అందుబాటులో ఉన్న నేపథ్యంలో బెటాలియన్‌ను ఇక్కడే కొనసాగించాలని కోరుతున్నారు.

అక్రమాలపై విచారణ..

30 ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలకు సంబంధించిన కేడెట్స్ క్యాంపునకు వెళ్లకున్నా వెళ్లినట్లు సర్టిఫికెట్లు ఇవ్వడం, పరీక్షకు హాజరు కావడం, డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలపై ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ ఆధ్వర్యంలో ఫిర్యాదులపై గుంటూరు బెటాలియన్‌లో ఎన్‌సీసీ అధికారులు, సిబ్బందిని పలుమార్లు విచారించినట్లు సమాచారం. ప్రాథమికంగా బెటాలియన్ పరిధిలో అక్రమాలు చోటు చేసుకున్నాయని భావించిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీంతో విచారణ ఓ వైపు కొనసాగుతుండగానే బెటాలియన్‌పై చర్యలకు ఎన్‌సీసీ ఉన్నతాధికారులు ఉపక్రమించారు.

సందిగ్ధంలో ఎన్‌సీసీ ఫలితాలు

2024 ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఎన్‌సీసీ ఏ, బి, సీ సర్టిఫికెట్‌కు సంబంధించిన డ్రిల్ టెస్ట్, రాతపరీక్షలు పూర్తి చేశారు. పరీక్షలు పూర్తయి నాలుగు నెలలు కావస్తున్నా ఇంకా ఫలితాలు విడుదల కాకపోవడంతో ఎన్‌సీసీ కేడెట్స్‌లో ఆందోళన నెలకొంది. ఎన్‌సీసీ సర్టిఫికెట్స్‌కు విద్యాసంస్థల్లో ప్రవేశాలకు రిజర్వేషన్ ఉంది. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్, ఇంజినీరింగ్ ప్రవేశాలు, డిగ్రీ, పీజీ ఇలా అన్ని కోర్సులకు సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఎన్‌సీసీ ఫలితాలను విడుదల చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఎన్‌సీసీ కేడెట్స్ కోరుతున్నారు.

బెటాలియన్‌ను తరలించవద్దని డీడీజీకి విన్నవించాం



అన్ని వసతులు కలిగిన కడప 30 ఆంధ్రా బెటాలియన్‌ను తిరుపతి గ్రూప్‌నకు తరలించవద్దని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీకి విన్నవించాం. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలే తప్ప ఇలా బెటాలియన్‌ను తరలించడం సరికాదు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్ర ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ను కడపలో ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. అయితే ఉన్న బెటాలియన్‌నే తరలించాలనుకోవడం మేము ఊహించలేకున్నాం.

– పి.వి. సుబ్బారెడ్డి, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్స్ అసోసియేషన్

ఎన్‌సీసీ ప్రవేశాలను చేపట్టాలి



ఎన్‌సీసీలో చేరాలనుకోవడం విద్యార్థుల కల. అలాంటి ఎన్‌సీసీ ప్రవేశాలను నిలిపివేయడం సరికాదు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎన్‌సీసీ ప్రవేశాల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. ఎన్‌సీసీ బెటాలియన్ తరలింపు ఆలోచన విరమించుకోవాలి.

– ఎం. అశోక్, ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్, కడప

ఎన్‌సీసీ ఫలితాలు విడుదల చేయాలి



ఎన్‌సీసీ ఫలితాలను త్వరితగతిన విడుదల చేస్తే మంచిది. ఇప్పటికే నాలుగు నెలలవుతున్నా ఇంకా ఫలితాలు రాలేదు. కడపలో బెటాలియన్ ఉండటం ద్వారా క్యాంపులు ఇక్కడే చేసే అవకాశం ఉండేది. క్యాంపులు సైతం రద్దు చేయడం మాలాంటి కేడెట్స్‌కు ఇబ్బందికరం.

– వసుంధర, ఎన్‌సీసీ కేడెట్, కడప

కొత్త కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్



చామకూరి శ్రీధర్, నూతన జిల్లా కలెక్టర్

రాయచోటి: కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్‌ను బదిలీ చేస్తూ మంగళవారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జనవరి 31న జిల్లా కలెక్టర్‌గా ఆయన వచ్చారు. జిల్లా కొత్త కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది.2016కు బ్యాచ్‌కు చెందిన ఈయన బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.పదోన్నతిపై అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా వస్తున్నారు. ఈయన త్వరలోనే జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభమైంది. తనదైన శైలిని అనుసరించి జిల్లా అధికారులను సమన్వయం చేసుకుని విజయవంతంగా ముగించి ఉన్నతాధికారుల మన్ననలను అందుకున్నారు.

ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు శాఖాధిపతి ఆచార్య తుమ్మలకుంట శివప్రతాప్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జియాలజిస్టుగా అర్హత పొందవచ్చన్నారు. ఇంకా ఏపీఎస్ఆర్ఏసీ, ఏపీ ఎమ్‌డీసీ, ఏపీ గ్రౌండ్ వాటర్ బోర్డ్ వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు అర్హులన్నారు. సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో లెక్చరర్‌గా, సెంట్రల్ గవర్నమెంట్ ఓఎన్‌జీసీ, జీఏఐఎల్, సెయిల్, కోల్ ఇండియా లిమిటెడ్, బీపీఎల్, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోపు (ఓ.ఎ.ఎం.డి.సి) వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర సందేహాలకు ఎం.శశికుమార్ (8985597928), బి. మురళీధర్‌రెడ్డి (9985442196) సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

డీసీసీబీలో రుణమస్తు

- అన్నదాతలకు అండగా.. వ్యాపారులకు దన్నుగా
- 2024–25 ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యం రూ. 781.86 కోట్లు
- అగ్రికల్చర్ కింద రైతులకు రూ.390 కోట్ల రుణాలు
- రీటెయిల్ లోన్ల కింద రూ. 391.86 కోట్ల రుణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు, వ్యాపారులు



కడపలోని డీసీసీ ప్రధాన బ్యాంకు

కడప అగ్రికల్చర్: రైతుల పంటలసాగుకు అవసరమైన పెట్టుబడి రుణాలను జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీ) సకాలంలో అందిస్తూ వారి అభివృద్ధికి సహకారం అందిస్తోంది. రైతులతోపాటు వ్యాపారస్తులకు, డ్వాక్రా సంఘాలకు, వ్యక్తిగత లోన్లు, ఎడ్యుకేషన్‌లోన్లతో పాటు పలు రకాల రుణాలను అందిస్తూ వారి అభివృద్ధిని ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుంటున్న రైతులు ఉత్సాహంగా పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. జూన్ నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే రైతన్నలకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను గత ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ తరుణంలో రైతన్నల పంటలసాగుకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బ్యాంకులు రుణాలను అందించేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ తరుణంలో ఎవరెవరికి ఎంతెంత రుణాలను ఇవ్వాలనే లక్ష్యాన్ని డీసీసీబీ ఖరారు చేసింది. ఇతర బ్యాంకులకంటే కొన్నింటిపైన తక్కువ వడ్డీతో సకాలంలో రుణాలను అందించి వారి అభివృద్ధికి చేయూతనిస్తుంది.

ఈ ఏడాది లక్ష్యం రూ. 781.86 కోట్లు: డీసీసీ బ్యాంకు తరఫున జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ. 781.86 కోట్ల రుణాలను మంజూరు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వ్యవసాయ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక, బంగారు ఆభరణాలు, వ్యవసా యేతర రుణాలతోపాటు డ్వాక్రా మహిళలకు రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో బంగారు ఆభరణాలపై రూ. 69 కోట్లు, క్రాపు లోన్ల రుణాల కింద రూ. 37 కోట్లు, డ్వాక్రా సంఘాలకు రూ. 81 కోట్లు, ఎల్‌టీ లోన్ల కింద 33 కోట్లు, రైతు నేస్తం కింద రూ. 309 కోట్లు, అలాగే వీటితో పాటు పలు లోన్ల కింద మొత్తంగా రూ.781.86 కోట్ల రుణాల ఇవ్వాలని నిర్ణయించారు. వీటితోపాటు డిపాజిట్ల కింద వివిధ వర్గాలు, ప్రభుత్వ కార్యాలయల నుంచి రూ.166.52 కోట్లు సేకరించాలని బ్యాంకు వారు లక్ష్యంగా పెట్టుకున్నారు. డిపాజిట్లకు సంబంధించి 7.60 శాతం వడ్డీని ఇవ్వనున్నారు. ఇందులోను సీనియర్ సిటిజన్లు చేసిన డిపాజిట్లకు రూ. 8.10 వడ్డీని చెల్లించనున్నారు.

ఎలాంటి సిఫారసులు లేకుండానే...



డీసీసీ బ్యాంకులో రుణాల మంజూరుకు ఎలాంటి సిఫారస్సులు అవసరం లేదు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రుణాలను మంజూరు చేస్తాం. రుణాలను కావాల్సిన వారు పత్రాలను తీసుకుని నేరుగా వచ్చి బ్యాంకును అధికారులను సంప్రదించవచ్చు. – రాజామణి, సీఈఓ(ఇన్‌చార్జు), డీసీసీ బ్యాంకు. కడప.

పండుటాకులకు అందిన పింఛన్ డబ్బులు!



మదూరులో వృద్ధుడికి పింఛన్ డబ్బులు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చాపాడు: వైఎస్ఆర్ జిల్లాలోని మదూరు, అన్నవరం, టీఓపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఫిర్యాదుతో ఆగిపోయిన పింఛన్‌దారులకు ఎట్టకేలకు పింఛను డబ్బులు అందాయి. మంగళవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పింఛన్ అందించారు. మండలంలోని మదూరులో 40 మంది, అన్నవరంలో 28 మంది, టీఓపల్లెలో 26 మంది పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను అర్హతలపై పునర్విచారణ చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపు కార్యక్రమంలో 94 మంది పింఛన్‌దారులకు డబ్బులను అధికారులు ఆపారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకూ 'సాక్షి'లో మంగళవారం 'పండుటాకులపై టీడీపీ కక్ష' అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ విజయరామరాజు బాధితులకు ఫించన్ డబ్బులను అందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే పుట్టా ఫిర్యాదు మేరకూ విచారణ చేపట్టి పింఛను డబ్బులు ఇవ్వకుండా నిలుపుదల ఎలా చేస్తారని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఎంపీడీఓ రహంతుల్లయ్యలపై సీరియస్ అయ్యారు. పింఛన్ డబ్బులపైనే ఆధారపడి జీవించే పలు రకాలైన పింఛన్ లబ్ధిదారులు డబ్బులు అందటంతో సంతోషం వ్యక్తం చేశారు.

ఇది తగునా..!

- జిల్లాలో కొనసాగుతున్న టీడీపీ దాడులు
- ఎస్ఐపై మంత్రి సతీమణి హరిత రుబాబు
- గుర్రకొండ పోలీసుస్టేషన్‌పైకి దూసుకెళ్లిన తమ్ముళ్లు
- టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడుల పర్వం

సాక్షి టాస్క్‌ఫోర్స్: చరిత్రలో ఎన్నికలను పరిశీలిస్తే గెలుపోటములు సహజం. ఒకసారి ఒక పార్టీ అధికారంలోకి వస్తే, మరోసారి ఇంకో పార్టీ అధికారంలోకి రావడం సాధారణం . అయితే అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా చేయాల్సిందిపోగా...అటవిక రాజ్యం కనిపించేలా భయానక పరిస్థితులు సృష్టిస్తున్నారు. అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు తెగబడుతున్నారు. కౌంటింగ్ రోజు నుంచి మొదలు పెట్టి వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరించిన వారిని టార్గెట్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం...వైఎస్సార్ సీపీ పరాజయం కావడంతో ఏమి చేసినా చెల్లుతుందనే కోవలో దాడులకు పాల్పడుతున్నారు. నయానో, భయానో ఏదో ఒక రకంగా దారికి తెచ్చుకుంటే అడ్డు ఉండదన్న నెపంతో అరాచకం సృష్టిస్తున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో పలుచోట్ల దాడులు బెంబేలెత్తిస్తున్నాయి. సాక్షాత్తు రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత వాహనం వెంట రావడం ఆలస్యమైందని ఎస్ఐకి చీవాట్లు పెట్టిన వ్యవహారం అధికార పార్టీలోనే తీవ్ర చర్చకు దారి తీసింది. అంతేకాకుండా వారం రోజుల కిందట గుర్రంకొండ పోలీసుస్టేషన్‌పైనే దాడికి తెలుగు తమ్ముళ్లు తెగబడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలం వడ్డెపల్లెలో ఇంటికి తాళం వేసి వెళ్లిపోయిన దృశ్యం (ఫైల్)

తెగబడుతున్న తమ్ముళ్లు

అన్నమయ్య జిల్లాలో తెలుగు తమ్ముళ్లు తెగబడుతున్నారు. ప్రధానంగా పీలేరులో ఎన్నికల కౌంటింగ్ అనంతరం నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులకు చెందిన ఆస్తులను ధ్వంసం చేసే కార్యక్రమానికి పూనుకున్నారు. రాయచోటి పరిధిలోని సంబేపల్లె మండలంలో పింఛన్లకు సంబంధించిన వ్యవహారంపై సచివాలయ సిబ్బందిపై అధికార పార్టీ నాయకులు తీవ్రంగా మందలించడం కనిపించింది. చిన్నమండెం మండలంలోనూ ఇటీవల భూమి వ్యవహారంపై మాజీ సర్పంచ్‌పై తెలుగుదేశం పార్టీ నాయకులు బెదిరింపులకు దిగారు. రాయచోటి పరిధిలో కౌన్సిలర్ల ఇళ్లపైకి వెళ్లడంతోపాటు వాహనాల ధ్వంసం చేయడం జరిగింది. ప్రత్యేకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులకు సంబంధించి ఆస్తి నష్టానికి పాల్పడుతుండడంపై ప్రజాస్వామ్య వాదులు ఖండిస్తున్నారు. అలాగే వైఎస్సార్ జిల్లాలోని సింహాద్రిపురం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో కూడా టీడీపీ శ్రేణులు రచ్చ చేశాయి. మైదుకూరు, జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె ప్రాంతాల్లో కూడా తెలుగు తమ్ముళ్లు దౌర్జన్యాలు, బెదిరింపులకు దిగుతున్నారు. అధికార గర్వంతో వైఎస్సార్ సీపీ శ్రేణులను అణగదొక్కడమే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లడం ఆందోళన కలిగించే పరిణామం.

రక్షణ లేక ఊర్లను వదిలిన బాధితులు

పీలేరు నియోజకవర్గంలోని కేవీ పల్లె మండలంలో టీడీపీ శ్రేణుల ధాటికి వడ్డెపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఊరు విడిచి వెళ్లిపోయారు. పోలీసులను తమను రక్షించాలని కోరినా ఫలితం లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో గ్రామం విడిచి 15 కుటుంబాలు వెళ్లిపోయాయి. అధికార పార్టీ నేతలు దాడులకు తెగబడుతుండడంతో ఏమి చేయాలో పాలుపోని వైఎస్సార్ సీపీ శ్రేణులు చేసేదేమి లేక బెదిరింపులు, దాడులకు తట్టుకోలేక అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదంటూ గోడు వెళ్లబోసుకుంటూ ఊరు దాటినట్లు తెలియవచ్చింది.

దాడులు సరికాదు

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలువడం, ఓడిపోవడం సర్వసాధారణమని ప్రజాస్వామ్య వాదులు పేర్కొంటున్నారు. అధికారంలోకి ఎవరు వచ్చినా ఒకరిపై ఒకరు ఇలా దాడులు చేసుకోవడం మంచిది కాదని వారు సూచిస్తున్నారు. తెలుగు తమ్ముళ్లు అనుసరిస్తున్న వైఖరిని వారు తప్పుబడుతున్నారు. పోలీసులు కూడా అధికార పార్టీ పక్షాన కాకుండా కొంతమేరైనా ప్రజలకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. తద్వారా ప్రజాస్వామ్యంలో ప్రజలకు కొంతైనా ధైర్యం కల్పించిన వారవుతారని పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చాపాడు : మండల పరిధిలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు నాలుగు ట్రాక్టర్లను సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నరహరిపురం గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు, ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సోమవారం రాత్రి విధుల్లో నిర్వహిస్తున్న పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్లను ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడిపాడుకు చెందిన సగబాల సుబ్బరాయుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుబ్బరాయుడు అలంఖాన్ పల్లెలో తన కుమార్తె వద్ద నివసిస్తున్నాడు. మంగళవారం తన బంధువులను చూసేందుకు వచ్చిన అతను పందిళ్లపల్లెలో బస్ దిగాడు. రోడ్డు దాటుతుండగా తాడిపత్రి నుంచి కడప వెళ్తున్న ఐచర్ వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం చాపాడు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. అల్లుడు పుల్లూరు రాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

కారును ఢీకొన్న ద్విచక్రవాహనం

– వ్యక్తికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

రామసముద్రం : రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామం వద్ద సోమవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనం కారును ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. రాగిమాకులపల్లె గ్రామానికి చెందిన బి.కృష్ణకుమార్ (27) రామసముద్రం నుంచి ద్విచక్రవాహనంపై సొంత గ్రామానికి వెళ్తుండగా నరసాపురం వద్ద బైకును తప్పించబోయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణకుమార్‌కు తలకు , కాలిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సౌమ్యనాథ ఆలయం.. శిల్పకళా నిలయం



- భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ సౌమ్యనాథుడు
- ఈనెల 13 నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు
- 20న శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథుని కల్యాణం

నందలూరు : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అత్యంత ప్రాశస్త్యం పొందిన ఆలయాల్లో నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం ఒకటని చెప్పవచ్చు. నందలూరు మండలం బహుదా నది తీరాన నారదమునిచే ఈ ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ఆలయం చోళుల శిల్పకళా నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో ఆలయం విస్తరించి ఉంది. ఈ ఆలయంలో 108 స్తంభాలు ఉన్నాయి. చోళరాజులు 11వ శతాబ్దం పూర్వార్ధంలో ఆలయం నిర్మించి సౌమ్యనాథ స్వామికి 120 ఎకరాల మాన్యం ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. చోళ, పాండ్య రాజులు 17వ శతాబ్దం వరకు ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. 12వ శతాబ్దంలో కాకతీయ ప్రతాపరుద్రుడు ఆలయానికి గాలిగోపురం కట్టించాడు. నందలూరు, ఆడపూరు, మందరం, మన్నూరు, హస్తవరం గ్రామాలను దానంగా ఇచ్చినట్లు శాసనాలు చెబుతున్నాయి. శ్రీ సౌమ్యనాథస్వామి వారి మూల విరాట్‌ను గమనిస్తే తిరుమలలో ఉన్న శ్రీనివాసుడు కటి హస్తంతో తన పాదాలను శరణు కోరండి.. పునీతులు కండి అని ప్రబోధిస్తుంటే, నందలూరులోని శ్రీ సౌమ్యనాథుడు తనను నమ్మి శరణు వేడితే కోరిన కోర్కెలు తీరుస్తానంటూ అభయ హస్తంతో దర్శనమిస్తాడు. కాగా నిరంత్ర అనే మహారాజు పూర్వం నిరంతపురం గ్రామాన్ని నిర్మించగా, ఆ గ్రామం బహుదానది వెల్లువలో కొట్టుకుపోగా తరువాత నలంద అనే రాజు ఈ స్థలాన్ని సందర్శించి నందలూరు అనే పేరుతో తిరిగి గ్రామాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. ప్రసిద్ధ వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు అన్నమాచార్యుడు వెంకటేశ్వరునిపై పలు శృంగార కీర్తనలు ఈ ఆలయంలో కూర్చొని రచించినట్లు ఆధారాలున్నాయి.

ఆలయ విశేషాలు..

- సౌమ్యనాథుని గర్భగుడిలో ఎలాంటి దీపం లేకపోయినా మూలవిరాట్ ఉదయం నుంచి సాయంత్రం వరకు దేదీప్యమానంగా వెలుగొందే విధంగా ఆలయాన్ని నిర్మించడం ఒక అద్భుతం. ఆలయ నిర్మాణంలో అప్పటి శిల్పకళా నైపుణ్యం వారి కళకు అద్దం పడుతుంది. గర్భగుడి ప్రథమ ద్వారం నుంచి గర్భాలయంలోని మూలవిరాట్‌కు దాదాపు వంద గజాల దూరం ఉంటుంది. ప్రథమ ద్వారం నుంచి చూస్తే స్వామివారు దేదీప్యమానంగా వెలుగుతూ దర్శనమిస్తారు.
- ఆలయ శాసనాలను గమనిస్తే సూర్యచంద్రుల చిహ్నాలు కనిపిస్తాయి. ఆలయ కుడ్యాల పైభాగాన చేప ఆకారం కనిపిస్తుంది. బహుదానది వరదల వల్ల ఆలయంలో ఉన్న ఆ చేప ఆకారాన్ని వరద నీరు తాకితే ప్రాణంతో నీటిలో కలిసిపోతుందని భక్తుల నమ్మకం.
- ఆలయ గర్భగుడి ముందున్న కల్యాణ మండపం కొంచెం విలక్షణంగా కనిపిస్తుంది. ఈ మంటపానికి కింది భాగాన సింహం తలలు ఉన్నాయి. సాధారణంగా ఏ ఆలయానికైనా సింహాల తలలు ఆలయం పై భాగంలో ఉంటాయి. కానీ ఇక్కడ మాత్రం మంటపానికి కింది భాగంలో ఉండటం వలన ఈ ఆలయానికి కింది భాగంలో మరో ఆలయం ఉంటుందని చరిత్రకారుల నమ్మకం.
- ఆలయం లోపల విశాలమైన యాగశాల, యోగ నరసింహస్వామి, గణపతి, ఆంజనేయస్వామిలకు చెందిన చిన్నచిన్న ఆలయాలు ఉన్నాయి. దేవాలయ ప్రాంగణంలో ఒక పెద్దకోనేరు ఉంది. స్వామివారికి బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు ఇక్కడ శ్రీవారి తెప్పోత్సవం నిర్వహించడానికి అనువుగా కోనేరు నిర్మించారు.
- 16వ శతాబ్దంలో ఇక్కడికి 10 మైళ్ల దూరంలో ఉన్న పొత్తపిని రాజధానిగా చేసుకొని పరిపాలించిన తిరువెంగనాథుని పట్టపురాణి చనేనమణి సౌమ్యనాథునికి శంఖు చక్రాలను, రత్న కిరీటాన్ని, జక్కు తిమ్మసాని రత్నాల పరాశరం, జువ్వల కమ్మలు, ఇతర స్వర్ణాభరణాలు బహుమానంగా ఇచ్చినట్లు ఆలయ శాసనాల ద్వారా తెలుస్తోంది.
- స్వామివారిని దర్శించుకొని కోర్కెలను కోరుకొని నిశ్చల భక్తితో గర్భాలయం చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేస్తే వారి కోరికలు నెరవేరుతాయని నమ్మకం. కోరిక నెరవేరగానే స్వామివారిని దర్శించుకుని గర్భాలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధీనంలో ఉన్న సౌమ్యనాథ ఆలయంలో ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు.


సౌమ్యనాథ స్వామి మూలవిరాట్


శిల్పకళా నైపుణ్యం

13 నుంచి బ్రహ్మోత్సవాలు

సౌమ్యనాథ స్వామి ఆలయంలో జూలై 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు 11 రోజులపాటు అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 13వ తేదీ ఉదయం తిరుమంజనం, రాత్రి అంకురార్పణ, 14న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలి వాహనం, 15న ఉదయం పల్లకీసేవ, రాత్రి హంస వాహనం, 16న ఉదయం పల్లకీసేవ, రాత్రి సింహ వాహనం, 17న ఉదయం పల్లకీసేవ, రాత్రి హనుమంత వాహనం, 18న ఉదయం శేషవాహనం, రాత్రి గరుడ వాహనం, 19న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనం, 20న ఉదయం కల్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 21న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 22న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం, 23న పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

తిరిగి సొంత జిల్లాకు తహసీల్దార్లు

కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు వీలుగా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు షెడ్యూల్ వెలువడకముందే జిల్లాలోని తహసీల్దార్లను నంద్యాల, కర్నూలు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినా ఎన్నికల కమిషన్ నుంచి బదిలీలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు వెలువడలేదు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుని విన్నపాన్ని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాకు బదిలీ చేసింది. త్వరలోనే తహసీల్దార్లు జిల్లాకు చేరుకోనున్నారు.

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

కడప ఎడ్యుకేషన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4వ తేదీ తలపెట్టిన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు, ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్ నాయక్, సీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపీ నాగేంద్ర, ఎస్ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, టీఆర్ఎస్వై జిల్లా అధ్యక్షుడు రెడ్డిసాయి కోరారు. ఈ విషయమై మంగళవారం కడపలోని ఆపూస్మ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రామచంద్రారెడ్డి, క్రూస్మా రాష్ట్ర నాయకుడు లెక్కల జోగిరామిరెడ్డిలను తమ పాఠశాలల్లో కలిసి బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీ, ఎన్‌టీఏ అసమర్థత కారణంగా నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారాన్ని చెల్లించాలన్నారు.

కడప పాత బస్టాండులో భవనం తొలగింపు


జేసీబీతో భవనం తొలగింపు దృశ్యం

కడప కల్చరల్ : కడప నగరం పాత బస్టాండులో గల ఓ భవనాన్ని మంగళవారం జిల్లా దేవదాయశాఖ తొలగించింది. ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 20 సెంట్ల స్థలంలో ఉన్న ఆ భవనాన్ని జేసీబీ సాయంతో తొలగించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కడప నగరానికి చెందిన యాదాళ్ల పిచ్చయ్యశ్రేష్టి ఛారిటీస్ అసోసియేషన్‌కు చెందిన సర్వే నెంబరు 5లో 20 సెంట్ల స్థలంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయాన్ని తొలగించామని ఏసీ తెలిపారు. తమ శాఖ అధికారులతోపాటు తనిఖీ అధికారి ఛారిటీస్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

పదేళ్ల క్రితం...

యాదాళ్ల పిచ్చయ్యశ్రేష్టి ట్రస్టుకు సంబంధించిన ఎకరా 20 సెంట్ల స్థలాన్ని 2016లో సంబంధిత స్థల హక్కుదారులు కోర్టు ద్వారా ఆదేశాలు పొందడంతో పోలీసుల సహకారంతో తమ శాఖ అక్కడున్న షెడ్లను, పురాతన భవనాన్ని తొలగించిందని అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ తెలిపారు. అందులోని 20 సెంట్ల స్థలంలో రేకులషెడ్డు, ముందుభాగంలో చిన్న హోటల్ ఉండేవన్నారు. తమ సూచనల మేరకు హోటల్‌ను ఇటీవలే పూర్తిగా తొలగించారని, ప్రస్తుతం తాము రేకులషెడ్డును తొలగించినట్లు ఆయన తెలిపారు. దీంతో ట్రస్టు స్థలం పూర్తిగా యజమానుల స్వాధీనం అయిందన్నారు.

కడప స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఏ.గఫూర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఏ.గఫూర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఉపాధ్యాయ భవన్ మీటింగ్ హాల్‌లో రెండవ రోజు సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రెండవ పెద్ద మిత్రపక్షంగా టీడీపీ ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, ఎ.రామ్మోహన్, జి.శివకుమార్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, కె.శ్రీనివాస్‌రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు, కె.సత్యనారాయణ, లక్ష్మీదేవి, ఏడు నియోజకవర్గాల్లో ని సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు మీ అబ్బ జాగీరా!


వెంకటేశ్వరస్వామి చిత్రపటంపై ప్రమాణం చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ వెంకటరత్నమ్మ


సబ్ రిజిస్ట్రార్ వెంకటరత్నమ్మతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

- సబ్ రిజిస్ట్రార్‌పై ఎమ్మెల్యే వరద ఆగ్రహం
- లంచాలు తీసుకోనని ప్రమాణం చేయించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు క్రైం : సైనికులు భార్యాపిల్లలను వదిలేసి దేశానికి సేవ చేస్తున్నారు.. ఇక్కడ మీరేం చేస్తున్నారు.. ఎంత దొరికితే అంత దోపిడీ చేస్తున్నారు.. అంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులపై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారని పలువురు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మంగళవారం నేరుగా ఆఫీసుకు వెళ్లారు. కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ చాంబర్‌కు వెళ్లారు. అవినీతి జరిగిందని ఎవరైనా తన వద్దకు వచ్చి చెబితే మాత్రం కచ్చితంగా పిటిషన్ పెడతానన్నారు. ఉన్నతాధికారులు విచారణకు వచ్చినప్పుడు తగిన సాక్ష్యాలు కూడా ఇప్పిస్తానని ఎమ్మెల్యే అన్నారు. అందరి గురించి తెలుసుకునే ఇక్కడికి వచ్చానని, ఎవరెవరు ఎంత మేర అవినీతికి పాల్పడుతున్నారో తనకు తెలుసునని ఎమ్మెల్యే అన్నారు. తాను అవినీతికి పాల్పడలేదని సబ్ రిజిస్ట్రార్ వెంకటరత్నమ్మ చెప్పబోతుండగా. డబ్బు వసూలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తావా అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇదేమైనా మీ నాయన, మీ అబ్బగారి జాగీరు అనుకుంటున్నావా అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఏం జరిగేది తెలుసుకోవడానికి ఒక మనిషిని పెడతానని చెప్పారు. ఆఫీసుకు వచ్చే వారి నుంచి డబ్బు తీసుకోకుండా పని చేయాలని సబ్ రిజిస్ట్రార్, అధికారులతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

రామాపురం : మండలంలోని రాచపల్లి పంచాయతీ మంగళపల్లె వద్ద మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు, ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కటింగ్ మిషన్ చేతిపై పడి తీవ్ర గాయాలు


గాయపడిన టైల్స్ కార్మికుడు గోపాల్

మదనపల్లె : కటింగ్ మిషన్ చేతిపై పడి టైల్స్ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చౌడేపల్లి మండలంలో జరిగింది. పెద్దపంజాణి మండలం చల్లావారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు గోపాల్ (29) టైల్స్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం చౌడేపల్లెలోని ఓ ఇంటిలో టైల్స్ పని చేస్తుండగా, కటింగ్ మిషన్ చేతిపై పడి, చేయి తెగి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్య

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన బత్తల వెంకటలక్ష్మి(24) అనే యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెల్లటూరు గ్రామ సమీపంలోని ఎగువచెరువులో ఓ యువతి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిందని మంగళవారం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి సీఐ నాగరాజు, ఎస్ఐ హరిప్రసాద్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వెల్లటూరుకు చెందిన వెంకటలక్ష్మిగా గుర్తించారు. మృతురాలు బీటెక్ చదువుతుండేంది. ఈనెల 14వ తేదీన ఇంటినుంచి కోచింగ్‌కు వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. దాదాపు పది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థుల అస్వస్థతపై కలెక్టర్ సీరియస్

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం


ఈ ట్యాంకు నుంచే విద్యార్థులు నీళ్లు తాగేవారు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎల్ రవీంద్రారెడ్డి

ఖాజీపేట : ఖాజీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో కలుషిత నీరు తాగి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై జిల్లా కలెక్టర్ విజయరామరాజు సీరియస్ అయ్యారు. ఖాజీపేట ఎంఈఓ, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతోపాటు సంక్షేమ వసతి గృహ అధికారులు, విద్యాశాఖ, ఆరోగ్య శాఖ అధికారులను పిలిచి మాట్లాడారు. వెంటనే అక్కడి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఈఓ తోపాటు హెచ్‌ను తీవ్రంగా మందలించారు. సమస్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మాజీ మంత్రి డీఎల్ పరామర్శ

కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత విద్యార్థినులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మాత్రం మినరల్ వాటర్ తాగుతారు.. తమకేమో పురుగులు ఉండే నీళ్లు ఇస్తున్నారు.. భోజనం సక్రమంగా ఉండటం లేదు.. అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం బయటకు చెబితే తమ ఉద్యోగాలు పోతాయని ఉపాధ్యాయులు అంటున్నారని వారు పేర్కొన్నారు.

సమగ్ర విచారణ కోరతాను

'పాఠశాలలో జరిగిన విషయం చాలా బాధేసింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ అలాగే విద్యాశాఖ అధికారులను కోరతానని' మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులకు ఇక నుంచి మినరల్ వాటర్ ఇస్తామని అందుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని చెప్పారు.

ట్యాంకు తొలగింపు

విద్యార్థులు రెండు ట్యాంకుల్లోని నీళ్లు తాగేవారు. అయితే నల్లగా ఉన్న నీటి ట్యాంకును వెంటనే అక్కడి నుంచి తొలగించారు. ఆ ట్యాంకును పరిశీలిస్తే పూర్తి మట్టితో నిండి దుర్వాసన రావడంపై అందరూ విస్మయం వ్యక్తం చేశారు. మరో ట్యాంకును క్లోరినేషన్‌తో శుభ్రపరిచారు.

దాతలు ఇచ్చిన కిట్‌ను బిగించండి

విద్యార్థుల కోసం ఒక దాత మినరల్ వాటర్ ప్లాంట్‌కు సంబంధించిన చిన్న కిట్‌ను అందించారు.. అయితే దాన్ని బిగించకుండా పక్కన పెట్టారు. ఇది అధికారుల దృష్టికి రావడంతో వెంటనే మినరల్ వాటర్ ప్లాంట్‌ను బిగించాలని ఆదేశించారు.

బాలికల హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం సస్పెన్షన్

- ఎంఈఓలకు షోకాజ్ నోటీసులు
- డీఈఓ మర్రెడ్డి అనురాధ వెల్లడి

కడప ఎడ్యుకేషన్ : ఖాజీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మంచి నీటి ట్యాంకుల్లోని నీరు తాగి 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. పాఠశాలలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, ట్యాంకులకు మూతలు లేని కారణంగా అందులోని నీరు కలుషితమైంది. ఈ ట్యాంకుల శుభ్రత విషయంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నిర్లక్ష్యం వహించడం వల్లే పిల్లలు అస్వస్థతకు గురైనట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఈ మేరకు ఖాజీపేట బాలికల పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు టి. ఉమాదేవిని సస్పెండ్ చేయడంతోపాటు ఖాజీపేట ఎంఈఓ–1 నాగస్వర్ణలత, ఎంఈఓ–2 నాగరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. మూతలు లేని వాటికి తక్షణం మూతలు ఏర్పాటు చేయడంతోపాటు ట్యాంకుల వద్ద శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.